# వరంగల్ వాయిస్

*Evening Daily*

సంపుటి : 05 | సంచిక : 033
పేజీలు : 06 | వెల: రూ.5/-

శనివారం
జనవరి 10, 2026

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## క్యాలెండర్ ఆవిష్కరణ



'వరంగల్ వాయిస్' వార్తా సంస్థ రూపొందించిన నూతన క్యాలెండర్‌ను శ్రీ లక్ష్మి టెస్ట్ ట్యూబ్ బేబి సెంటర్ యజమాని డాక్టర్ జి.శ్రీలక్ష్మి శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలక్ష్మి వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ వాయిస్ పత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో వరంగల్ వాయిస్ రిపోర్టర్ ఉస్నగిరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ




# పెద్ద ప్లానే!

వివరాలు 2లో..

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా త్వరలో మోగనున్న నేపథ్యంలో పట్టణ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ముసాయిదా, ఓటర్ల జాబితాలను ప్రకటించింది. త్వరలో తుది జాబితా విడుదల చేసి, ఆ వెంటనే వారం రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, పట్టణాల్లో ముఖ్యంగా డోర్నకల్ లో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు వ్యూహాలకు పదును పెడుతూ 'గెలుపు గుర్రాల' వేటలో మునిగిపోయాయి. పార్టీ గుర్తులపై జరిగే ఈ ఎన్నికల్లో తమ రాజకీయ భవిష్యత్తును పరీక్షించుకోవడానికి ఆశావహులు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా, అధికార పార్టీ నుంచి టికెట్ ఆశించే వారి సంఖ్య ఈసారి అధికంగా ఉన్నట్లు సమాచారం. ఒక్కొక్క వార్డు నుంచి నలుగురు వరకు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. టికెట్ కేటాయింపు ప్రక్రియ పార్టీ నాయకులకు కత్తి మీద సాము లా మారింది. గెలుపు సామర్థ్యాన్ని అంచనా వేస్తూ, ఖర్చు చేయగలిగే 'లిక్విడ్ క్యాష్' చూపగలిగే వారికే టికెట్ కేటాయించాలని నేతలు కొత్త ఫార్ములాను అమలు చేస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది.

- వరంగల్ వాయిస్, డోర్నకల్

- మున్సిపల్ ఎన్నికల వేడి
- పట్టణాల్లో మొదలైన 'రాజకీయ స్టంట్లు'
- పోటాపోటీగా పార్టీల ప్రచారాలు
- ఎంట్రీ ఇవ్వనున్న జాగృతి
- కౌన్సిలర్ ఆశావహుల నయా ట్రెండ్
- స్థలం కాగితాలు తాకట్టు!




## మేడారం జాతరలో ప్లాస్టిక్ వాడొద్దు

- పర్యావరణాన్ని రక్షించాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

2లో..

## మేడారం ఏర్పాట్లపై మంత్రుల హై-లెవల్ సమీక్ష

- రేపు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాక
- ఆయనతో పాటు ఐదుగురు మంత్రుల బృందం పర్యటన
- జాతర ఏర్పాట్లకు మరింత వేగం
- అధికార యంత్రాంగంలో హడావుడి




6లో..

## నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు

పరకాల ఏసీపీ సతీష్ బాబు



6లో..

## చిన్నపిల్లల కిడ్నాప్ ముఠా అరెస్ట్

- వణుకుపుట్టిస్తున్న ముఠా దందా
- అయిదుగురు చిన్నారుల సురక్షిత రెస్క్యూ



# పెద్ద ప్లానే!

- మున్సిపల్ ఎన్నికల వేడి
- పట్టణాల్లో మొదలైన 'రాజకీయ స్టంట్లు'
- పోటాపోటీగా పార్టీల ప్రచారాలు
- ఎంట్రీ ఇవ్వనున్న జాగృతి
- కౌన్సిలర్ ఆశావహుల నయా ట్రెండ్
- స్థలం కాగితాలు తాకట్టు!

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా త్వరలో మోగనుంది. ఎన్నికల సంఘం ఇప్పటికే ముసాయిదా, ఓటర్ల జాబితా ప్రకటించగా, త్వరలో తుది జాబితా విడుదల చేసి, అనంతరం వారం రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో రాజకీయ పార్టీల్లో ఎన్నికల వేడి మొదలైంది. డోర్నకల్‌తో సహా రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో 'గెలుపు గుర్రాల' వేటను అధికార, ప్రతిపక్ష పార్టీలు ముమ్మరం చేశాయి. పార్టీ గుర్తులపై జరిగే ఈ ఎన్నికల్లో తమ రాజకీయ భవిష్యత్తును పరీక్షించుకునేందుకు ఆశావహులు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ నుంచి టికెట్ ఆశించే వారి సంఖ్య ఈసారి ఎక్కువగానే కనిపిస్తోంది. ఒక్కొక్క వార్డు నుంచి నలుగురు వరకు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది.

### టికెట్ కేటాయింపు కత్తి మీద సాము

టికెట్ కేటాయింపులో నాయకులు కొత్త ఫార్ములాను అమలు చేస్తున్నారు. వార్డు, చైర్మన్ పదవి కోసం ఎంత ఖర్చు చేయగలరని అంచనా వేస్తూ, 'లిక్విడ్ క్యాష్' చూపగలిగే వారికే టికెట్ కేటాయించేందుకు నేతలు సిద్ధమవుతున్నారు. చైర్మన్ పదవి కోసం కనీసం రూ. 40 లక్షల నుంచి 60 లక్షల వరకు ఖర్చు చేసే వారే పోటీలో దిగాలని పార్టీ నాయకులు సూత్రప్రాయంగా చెబుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలకు, ఇన్‌ఛార్జీలకు అభ్యర్థుల ఎంపిక సవాలుగా మారింది.

### డోర్నకల్‌లో కవిత జాగృతి ఎంట్రీ

రిజర్వేషన్లు, పొత్తుల లెక్కల్లో మునిగిపోయిన నాయకులు తమ భవిష్యత్తు రాజకీయాల కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలో టికెట్ల కోసం ఆశావహులు కీలక నేతలతో టచ్‌లోకి వెళ్లి, తమకే టికెట్ ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. రిజర్వేషన్ అనుకూలంగా లేకపోతే కనీసం కుటుంబ సభ్యులకైనా అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు.కాగా, డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ పదవి ఈసారి జనరల్ మహిళకు కేటాయించబడుతుందని ఆశిస్తున్న నేపథ్యంలో, ఇక్కడ రాజకీయం ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలతో పాటు ఈసారి కవిత జాగృతి పార్టీ అభ్యర్థులు కూడా రంగంలో ఉండేందుకు భారీ నెట్‌వర్క్‌తో పావులు కదుపుతోంది. బలమైన అభ్యర్థులకు నిధులు అందించి మరీ పోటీలో నిలిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

### ఇంటి కాగితాలు తాకట్టు..

వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న ఆశావహులు ఇప్పటి నుంచే 'ఎన్నికల స్టంట్లు' మొదలుపెట్టారు. అభ్యర్థులు నూతన వస్త్రాలపై దృష్టి సారించారు. తెల్ల, ఖద్దర్ చొక్కాలకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో, ఒక్కొక్కరు దాదాపు పది చొక్కాలను కుట్టించుకునేందుకు టైలర్ల వద్ద క్యూ కడుతున్నారు. డబ్బులు లేని మరికొందరు ఆశావహులు ఇంటి, స్థలం, పొలం కాగితాలను తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పరిణామాలు డోర్నకల్‌తో సహా రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో ఎన్నికల వేడిని తారా స్థాయికి చేర్చాయి.



## కొత్త చట్టంతో పేదల హక్కులకు భంగం

☐ కాంగ్రెస్ నాయకుల నిరసన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన పనికి ఆహార పథకం (ఉపాధి హామీ) సవరణలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శించింది. శనివారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయూబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొత్త చట్టంలో మహాత్మా గాంధీ ప్రతిమను తొలగించి, పనిని ప్రభుత్వమే నిర్ణయించే విధంగా మార్పులు చేశారని ఆరోపించారు. గతంలో పనికి ఆహార పథకం గ్రామ పరిధిలోని గ్రామ కమిటీ తీర్మానం ప్రకారం పనులు చేసుకునే వీలుండగా, కొత్త చట్టంలో పనిని ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. గతంలో కాంగ్రెస్ పరిపాలనలో పని దినాలు 100 రోజులుగా ఉండేవి. కొత్త చట్టంలో 125 రోజులకు పెంచామని చెప్పుకుంటూనే, 75 రోజులు కేంద్రం నిధులతో, 50 రోజులు రాష్ట్ర సర్కారు నిధులతో చేయాలని నిబంధన పెట్టారు. రాష్ట్రాల పరిస్థితి దయనీయంగా ఉన్న దరిమిలా, కేంద్రంలోని సర్కారు 75 రోజుల నుంచి 60 రోజులు మాత్రమే తనకు నచ్చినప్పుడు పని కల్పిస్తానని చెప్పి చట్టం చేయడం జరిగిందని అయూబ్ మండిపడ్డారు. ఈ మార్పులు కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూరే విధంగా ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీగా గుర్తింపు పొందడానికి సోనియా గాంధీ నేతృత్వంలో మెదక్ జిల్లా నంతపూర్లో ప్రారంభించిన ఈ పథకమే కారణమని అయూబ్ గుర్తు చేశారు. ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపిందని అన్నారు. ఈ చట్టమును తుంగలో తొక్కి, పేదలకు నష్టం చేకూర్చే విధంగా తీసుకురావడంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు తెలుపాలని నిర్ణయించినట్లు తెలిపారు. జనవరి 20 నుంచి 30 వరకు ప్రతి గ్రామంలో నిరసన కార్యక్రమాలు చేపట్టి, కొత్త చట్టంకు వ్యతిరేకంగా గ్రామ సభల్లో తీర్మానాలు చేస్తామని అయూబ్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన మహాత్మా గాంధీ పనికి ఆహార పథకమును మళ్లీ ప్రజల్లోకి తీసుకురావడం కోసం అన్ని రకాల చర్యలు చేపడుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మాధవ రెడ్డి, గీసుకొండ శ్రీనివాస్, పర్వతగిరి జాటోత్ శ్రీను, వర్ధన్నపేట ఎద్దు సత్యం, కిలా వరంగల్ ప్రకాష్, మండల అధ్యక్షులతో పాటు డివిజన్ కార్పొరేటర్ జన్ను శిబా అనిల్, వర్ధన్నపేట మహిళా అధ్యక్షురాలు, గిన్నారం రాజు, రాష్ట్ర ఓబీసీ కోఆర్డినేటర్ కోదాటి అనిల్, అధికార ప్రతినిధి ఆరేళ్ల రవి, మహమూద్ పాషా, కుద్దుస్, జావిద్, అయితా క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరలో ప్లాస్టిక్ వాడొద్దు

- పర్యావరణాన్ని రక్షించాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, మేడారం :** ములుగు జిల్లా మేడారం జాతర సందర్భంగా అటవీ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క భక్తులకు విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతంలో ఏ.ఎస్.ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా "ప్లాస్టిక్ ను వాడకండి. పర్యావరణాన్ని పరిరక్షించండి" అనే గోడపత్రికలను, "జాతరకు వచ్చే భక్తులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వాడకండి" అనే కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ, మేడారం జాతరకు వచ్చే భక్తులు ఈ అటవీ ప్రాంతంలో పర్యావరణాన్ని కాపాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాస్, కవర్లను ఉపయోగించవద్దని అన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆమె హెచ్చరించారు. ప్లాస్టిక్ ప్లేట్స్, కవర్లలో వేడి వేడి ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణకోశ వ్యాధులు, క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే మేడారం జాతరలో భక్తులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకుండా గాలి, భూమి, నీరును రక్షించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ రాం నాథ్ సుధీర్ కేకన్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఏ.ఎస్. ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఎర్రబోయిన రాజశేఖర్, సభ్యులు రాముసేవక్, రవికాంత్, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మేడారం ఏర్పాట్లపై మంత్రుల హై-లెవల్ సమీక్ష

- రేపు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాక
- ఆయనతో పాటు ఐదుగురు మంత్రుల బృందం పర్యటన
- జాతర ఏర్పాట్లకు మరింత వేగం
- అధికార యంత్రాంగంలో హడావుడి

**వరంగల్ వాయిస్, మేడారం :** కోట్లాది మంది భక్తులు తరలివచ్చే సమ్మక్క–సారలమ్మ మహాజాతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హై–లెవల్ సమీక్షకు శ్రీకారం చుట్టింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నేతృత్వంలో ఐదుగురు మంత్రులతో కూడిన ప్రత్యేక బృందం రేపు మేడారంలో పర్యటించనుంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతర నిర్వహించాలనే లక్ష్యంతో ఈ అత్యున్నత స్థాయి బృందం పర్యటన చేపడుతున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఈ పర్యటనలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (రెవెన్యూ, గృహనిర్మాణ, ఐ అండ్ పీఆర్ శాఖ), సీతక్క (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ), కొండా సురేఖ (ఎండొమెంట్, పర్యావరణం, అటవీ శాఖ), దుద్దిళ్ల శ్రీధర్ బాబు (ఐటీ, పరిశ్రమలు & వాణిజ్యం, శాసన వ్యవహారాల శాఖ), పొన్నం ప్రభాకర్ (రవాణా, బీసీ సంక్షేమ శాఖ)లు ఉన్నారు. మంత్రుల బృందం ఉదయం 11.45 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 12.45 గంటలకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని హెలిప్యాడ్‌కు చేరుకుంటుంది. అక్కడ కొద్దిసేపు విరామం అనంతరం 1.30 గంటలకు బయలుదేరి 1.50 గంటలకు ములుగు జిల్లా మేడారంలో దిగనున్నారు. మేడారం చేరుకున్న అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై జాతర ఏర్పాట్లపై మంత్రుల బృందం సమగ్ర సమీక్ష నిర్వహించనుంది. భక్తులకు కల్పిస్తున్న వసతులు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, భద్రత, వైద్య సదుపాయాలు, రవాణా వ్యవస్థ తదితర అంశాలను పరిశీలించి, ఇప్పటివరకు చేసిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారులను అడిగి తెలుసుకోనున్నారు. అవసరమైన చోట తక్షణ ఆదేశాలు జారీ



చేయనున్నట్లు సమాచారం. మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దివాకర్, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, డీఎఫ్ఓలు, ఇతర శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వసతి, రవాణా, భద్రత, ఎస్కార్ట్, ప్రోటోకాల్ తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాయంత్రం 4.30 గంటలకు మేడారం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న మంత్రుల బృందం సాయంత్రం 5.20 గంటలకు తిరిగి హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ పర్యటనతో మేడారం మహాజాతర ఏర్పాట్లకు మరింత వేగం పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# పశ్చిమలో వేగంగా అభివృద్ధి పనులు

## ◆ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్,హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో, శనివారం 52వ డివిజన్ పరిధిలోని వాగ్దేవి కళాశాల వెనుక భాగంలో చేపట్టనున్న సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకునే ఈ డ్రైనేజీ నిర్మాణాన్ని చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. డ్రైనేజీ పూర్తయితే వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగు సమస్యలు తగ్గి ప్రజలకు స్పష్టమైన ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. నయీం నగర్ పరిసర ప్రాంతాల్లో నాలాల వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని, ఇందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారని వివరించారు. ముఖ్యంగా, గ్రేటర్ వరంగల్ నగరానికి ప్రతిష్ఠాత్మకమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు కేటాయించిందని, ఈ నెలలోనే ఆ పనులు ప్రారంభం కానున్నాయని ఆయన వెల్లడించారు. ప్రజలు ఓటు వేసి గెలిపించినందుకు చరిత్రలో నిలిచేలా అభివృద్ధి పనులు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.



### సంక్రాంతి సంబరాల్లో నాయిని..

అనంతరం, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వాగ్దేవి కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగి మంటలను వెలిగించి ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొంటూ, అభివృద్ధితో పాటు సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు తడుక సుమన్, డైరెక్టర్ శ్రవణ్ రెడ్డి, నాయకులు సుగుణాకర్ రెడ్డి, అశ్విన్ రాథోడ్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జాగ్రత్తలే మీ ఆస్తులకు రక్షణ

## చిట్యాల ఎస్ఐ శ్రవణ్ కుమార్



**వరంగల్ వాయిస్, చిట్యాల:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చిట్యాల పట్టణం, పరిసర గ్రామాల్లో నివసించే ప్రజలు తమ స్వగ్రామాలకు వెళ్తున్న నేపథ్యంలో, ఇళ్లకు తాళాలు వేసి వెళ్తున్న తరుణంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందని చిట్యాల సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్ కుమార్ తీవ్రంగా హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, క్రింద తెలిపిన భద్రతా చర్యలు తప్పక పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మీరు ఊరికి వెళ్లే ముందు మీ పొరుగువారికి, వీలైతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా సమాచారం ఇవ్వండి. మీ ఇల్లు గమనిస్తూ ఉండమని ఇరుగుపొరుగు వారికి చెప్పండి. సాధ్యమైనంత వరకు ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. వాటిని మొబైల్‌కు కనెక్ట్ చేయడం ద్వారా ఎక్కడి నుండైనా ఇంటిని పర్యవేక్షించవచ్చు. ఇంట్లో ఎక్కువ నగదు, బంగారం ఉంచవద్దు. వాటిని బ్యాంకు లాకర్లలో లేదా సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలి. పాత పద్ధతిలో పెద్ద తాళాలు వేయడం కంటే, బయటకి కనిపించని విధంగా సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ లేదా లోపలి గడియలు వేయడం మంచిది. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం కానీ, డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్ నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శ్రవణ్ కుమార్ కోరారు.

# ఘనంగా సోమనాథ్ స్వాభిమాన పర్వ్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సోమనాథ్ ఆలయం విధ్వంసాన్ని, భయాన్ని, కాలాన్ని సైతం జయించిన అపూర్వమైన విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పేర్కొన్నారు. సోమనాథ్ ఆలయంపై జరిగిన దాడులకు వెయ్యేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, అలాగే 1951లో జరిగిన ఆలయ పునర్నిర్మాణానికి 75 సంవత్సరాలు (అమృతోత్సవం) పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని, బీజేపీ దేశవ్యాప్తంగా 'సోమనాథ్ స్వాభిమాన పర్వ్' కార్యక్రమాన్ని చేపట్టింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ జనవరి 11న సోమనాథ్ క్షేత్రంలో ప్రారంభించనున్న 'సహస్ర సంకల్ప యాత్ర'కు మద్దతుగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా, వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశిబుగ్గ శివాలయంలో ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రత్యేకంగా అర్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్, తదితర జిల్లా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# వేయి స్తంభాల గుడిలో బీజేపీ నేతల ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశ ఆత్మగౌరవానికి, సనాతన ధర్మ విశ్వాసానికి ప్రతీక అయిన సోమనాథ్ ఆలయంపై గజనీ మహ్మద్ దాడి చేసి కూల్చివేసిన చారిత్రక ఘటనకు 2026వ సంవత్సరానికి సరిగ్గా 1000 సంవత్సరాలు పూర్తవుతున్నాయి. ఈ వెయ్యేళ్ల సహనాన్ని, నిరంతర పునర్జీవనాన్ని గుర్తుచేసుకుంటూ, బీజేపీ జాతీయ పార్టీ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం 'సోమనాథ్ స్వాభిమాన పర్వం'గా నిర్వహించబడుతోంది. సోమనాథ్ స్వాభిమాన్ పర్వాన్ని పురస్కరించుకుని, శనివారం వరంగల్‌లోని చారిత్రాత్మక వేయి స్తంభాల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ మెంబర్, హనుమకొండ మాజీ శాసనసభ్యులు మార్తినేని ధర్మారావు ముఖ్య భూమిక వహించారు. బీజేపీ నాయకులు బింగి శ్రీనివాస్, గాదె రాంబాబు, గండ్రాతి రాజు, వలస అశోక్, మర్కా సునీల్ గౌడ్, కస్తూరి నవీన్, సార్గు సంపత్, వృక్షాల చంద్ర శేఖర్ తదితరులు శివాలయంలో అభిషేకములు, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, గంగు మణికంఠ శర్మ, ప్రణవ్ పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం భక్తులకు, నాయకులకు ఆశీర్వచనాలు అందజేశారు.

# ఉచితంగా కళ్ల జోళ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని వరికోలు గ్రామానికి చెందిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తన సొంతూరుకు సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో చేపట్టిన కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. కంటి వెలుగు పథకం స్ఫూర్తితో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 28, 2025న వరికోలులో ప్రారంభించిన ఉచిత కంటి పరీక్షల అనంతరం, శనివారం వారి కుమార్తె జన్మదినం సందర్భంగా అర్హులైన వారికి ఉచితంగా కళ్ల జోళ్లను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా పుట్టిన ఊరికి సేవ చేయాలన్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆలోచనను గ్రామస్థులు మనస్ఫూర్తిగా అభినందించి, హర్షం వ్యక్తం చేశారు. ఈ సేవా కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చంద కుమారస్వామి, సర్పంచ్ కుమార్, ఉప సర్పంచ్ భుజంగా రావు తో పాటు గ్రామ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

# మీడియాపై అనుచిత వ్యాఖ్యలకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

## బీజేపీ నేత డా.కాళీ ప్రసాద్‌రావు డిమాండ్



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మీడియా మిత్రులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, విలేకరులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీజేపీ కాంటెస్ట్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. శనివారం పరకాల బీజేపీ పట్టణ కార్యాలయంలో అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డా.కాళీ ప్రసాద్‌రావు మాట్లాడారు. ప్రజల పక్షాన పోరాడే మీడియానే ఎమ్మెల్యేలను ప్రజల ముందుకు తీసుకొచ్చిందని, అలాంటి వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం విడ్డూరమని ఆయన విమర్శించారు. పరకాల బస్టాండ్ ఆవరణలో చిరు వ్యాపారుల జీవనోపాధి కోసం నిర్మాణంలో ఉన్న కాంప్లెక్స్‌ను వెంటనే పూర్తి చేయాలని డా.కాళీ ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. బస్టాండ్ పరిసరాల్లో ఇటీవల జరిగిన మహిళ మృతి ఘటన నేపథ్యంలో, చిరు వ్యాపారులకు తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. రెండేళ్ల పాలనలో పరకాల నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలని ఆయన ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా నాయకులు, మహిళా నాయకులు, బూత్ అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారమే 'ప్రజా బాట' లక్ష్యం

## ▪ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మల్సూర్ నాయక్

**వరంగల్ వాయిస్, రేగొండ :** విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో "ప్రజా బాట" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎన్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) మల్సూర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు నేరుగా గ్రామస్థులతో మాట్లాడి, వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మల్సూర్ నాయక్ మాట్లాడుతూ, నాణ్యమైన విద్యుత్ వినియోగం కోసం పాటించాల్సిన పలు ముఖ్య సూచనలను గ్రామస్థులకు వివరించారు. విద్యుత్ మోటార్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు వాడాలని కోరారు. కెపాసిటర్లు వాడటం వలన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఉంటాయని, తద్వారా నాణ్యమైన విద్యుత్ పొందవచ్చని వివరించారు. స్టార్టర్ బాక్సుల దగ్గర ఎర్త్ వైర్లు కంపల్సరీగా వాడాలి. గృహాలలో కూడా ఎర్త్ వాడటం వలన ప్రమాదాల బారిన పడకుండా ఉండొచ్చని సూచించారు. నాణ్యమైన విద్యుత్ కోసం నాసిరకం వైర్లను ఉపయోగించవద్దని, మంచి నాణ్యత గల కేబుల్స్‌ను మాత్రమే



కొనుగోలు చేయాలని కోరారు. గృహాల్లో కూడా నాణ్యమైన వైర్లు వాడుతూ, తప్పకుండా ఎంసీబీలను అమర్చుకోవాలని తెలిపారు. ఫీజుల సమస్యలు ఏమైనా ఉంటే, వాటిని లైన్‌మెన్ లేదా ఎలక్ట్రిషియన్ లతో మాత్రమే వేయించాలని కోరారు. గ్రామంలో ఇళ్లపై నుంచి కరెంటు వైర్లు ఉన్నట్లయితే, వాటిని వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చల్లగురుగుల సుదర్శన్, మాజీ సర్పంచ్ కట్ల రాణి మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యులు బక్కతట్ల సురేష్, డి.సాంబయ్య, సిరంగి సతీష్, ఏఈ.రాజు, ఏఎల్ఎం విజయ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా సిద్దోజు రమేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులుగా సిద్దోజు రమేష్ నియమితులయ్యారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బుట్టి శ్యామ్ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలోని హరిత హోటల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా, సిద్దోజు రమేష్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. నియామకం అనంతరం సిద్దోజు రమేష్ మాట్లాడుతూ... తనకు ఈ కీలక బాధ్యత అప్పగించిన జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి, బీసీల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నియామకానికి సహకరించిన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బుట్టి శ్యామ్ సహా జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో సెయింట్ థెరిస్సా విద్యార్థికి ప్రథమ స్థానం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** కామారెడ్డి జిల్లా కేంద్రంలో గత మూడు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఆత్మకూరు మండలంలోని సెయింట్ థెరిస్సా పాఠశాలకు చెందిన విద్యార్థి మిరియాల చరణ్ జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి అద్భుత ప్రతిభ కనబరిచాడు. ఈ విజయంతో చరణ్ జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు అర్హత సాధించాడు. చరణ్ తన గైడ్ టీచర్ సనిష్ కె.సజీవ్ మార్గదర్శకత్వంలో "ఇన్-హోమ్ వేస్ట్ అవాయిడ్ బకెట్ కంపోస్ట్ మేకర్" అనే వినూత్న ప్రాజెక్టును ప్రదర్శించాడు. గృహ వ్యర్థాలను తగ్గిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే విధంగా రూపొందించిన ఈ ప్రాజెక్ట్ న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకట్టుకుని మొదటి బహుమతిని గెలుచుకుంది. రాష్ట్రస్థాయి పోటీలో పాఠశాలకు ఖ్యాతి తీసుకువచ్చిన విద్యార్థి మిరియాల చరణ్‌ను, గైడ్ టీచర్ సనిష్ కె.సజీవ్‌ను సెయింట్ థెరిస్సా పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జాయిస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం చరణ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చరణ్ ప్రతిభపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# రామాలయం అభివృద్ధికి విరాళం



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయం అభివృద్ధికి భక్తులు ముందుకు వస్తున్నారు. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా శనివారం ఆలయంలో అర్చకులు ముసునూరు నరేష్ ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. పూజ అనంతరం, గణపురానికి చెందిన బొల్లం అరుణ భాస్కర్ దంపతులు ఆలయ అభివృద్ధిలో భాగంగా శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి నూతన బీరువా కొరకు రూ.10,116 విరాళాన్ని అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ ఈ విరాళాన్ని దాతల నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూలా శ్రీనివాస్ గౌడ్, బటిక స్వామి, మాదాసు అర్జున్, మాదాసు మొగిలి, బూర రాజగోపాల్, మోటపోతుల రాజన్న గౌడ్, పాండవుల భద్రయ్య, దయ్యాల భద్రయ్య, ఉయ్యాల భిక్షపతి, గోరంట్ల రాజన్న గుప్తా పాల్గొన్నారు.

# క్రీడల్లో కేంబ్రిడ్జి విద్యార్థుల ప్రభంజనం

**అథ్లెటిక్స్, కరాటేలో ప్రతిభ**






**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంబ్రిడ్జి మాంటిస్సోరీ స్కూల్ విద్యార్థులు అథ్లెటిక్స్, కరాటే క్రీడాంశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తమ పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించిన అండర్-8 ఇయర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పరుగు పందాలలో కేంబ్రిడ్జి మాంటిస్సోరీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్లను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ స్టేట్ సెక్రటరీ సారంగపాణి, రామప్ప అకాడమీ చైర్మన్ ఐలి చంద్రమోహన్ గౌడ్, స్కూల్ ఇన్‌చార్జ్‌లు ప్రవళిక, దివ్య, హెప్సిబా, కోచ్ సతీష్ పాల్గొన్నారు. వర్ధన్నపేట ఇల్లందలో నిర్వహించిన 3వ ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్-2026లో కేంబ్రిడ్జి మాంటిస్సోరీ స్కూల్ విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని ఛాంపియన్స్‌గా నిలిచారు. విరాట్, నవిష్క, శ్రీలీనా, అద్విక్, శ్రీ శాన్వి, సమన్విత, ఆముక్తా లు ఫస్ట్, సెకండ్ కతాల్లో అద్భుత ప్రదర్శన చేసి గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ వంశీకృష్ణ ఐలి మాట్లాడుతూ "విద్యతో పాటు క్రీడలలో కూడా విద్యార్థులు రాణించాలి అనే లక్ష్యంతో కేంబ్రిడ్జి మాంటిస్సోరీ స్కూల్ ముందుకు సాగుతోంది" అని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయులు, కోచ్ కృషి అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ 3వ డాన్ మౌనిక మాస్టర్, స్కూల్ ఉపాధ్యాయులు హారిక లక్ష్మి, రమ్య, కావ్య, ఆశిష్ తో పాటు వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు, పీఆర్సీ సాధనకై త్వరలో కార్యాచరణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీపీఎస్ రద్దు, పీఆర్సీ సాధన అజెండాగా త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ తెలిపారు. శనివారం హనుమకొండ ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు కామగోని రాంబాబు అధ్యక్షతన జరిగిన జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జుట్టు గజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, 51 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ రెండు అంశాలే ప్రధాన అజెండాగా త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ప్రభుత్వం నెలనెలా విడుదల చేస్తున్న రూ. 700 కోట్ల బకాయిలు ఏమాత్రం సరిపోవడం లేదని, నెలకు కనీసం రూ. 1000 కోట్లు కేటాయించి ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు అన్నింటినీ చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు టెట్ తప్పనిసరిగా పాస్ కావాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు, కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా ఫిబ్రవరి 5న ఆల్ ఇండియా జాక్టో ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.జిల్లా అధ్యక్షుడు కామగోని రాంబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాల వల్ల ఉపాధ్యాయులపై రోజురోజుకు ఒత్తిడి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బోధనేతర పనులు తగ్గించి ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలని, నెలనెలా పదోన్నతులు కల్పించి ఖాళీలను భర్తీ చేయాలని ఆయన కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా, ప్రతి పాఠశాలకు ఒక పీఎస్ హెచ్ఎం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేమునూరి రాంబాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నామాని సాంబయ్య, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర రమేష్, పూర్వ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, ఆర్ సుధాకర్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు, వరంగల్, హనుమకొండ జిల్లాల బాధ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

# రయ్యాలకు సంక్రాంతి పురస్కారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని పోచమ్మ మైదానంలోని ఎల్ బీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ వ్యాఖ్యాత, గాయకులు రయ్యాల శ్రీధరాచార్యులును వరంగల్ నగరానికి చెందిన జేబీ కల్చరల్ ఆర్ట్స్ సంస్థ సంక్రాంతి పురస్కారంతో సత్కరించింది. సంస్థ ఆధ్వర్యాన విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక పోతన ఆడిటోరియంలో ఈరోజు, రేపు వివిధ అంశాలలో నిర్వహించనున్న పోటీల కార్యక్రమాలను ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా, సంస్థ అధినేత జడల శివ హరిత, ముఖ్య అతిథి బీజేపీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, గౌరవ అతిథి బీజేపీ నాయకుడు, వరంగల్ మాజీ మేయర్ రాజేశ్వరరావు చేతుల మీదుగా రయ్యాల శ్రీధరాచార్యులు సంక్రాంతి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరినాథ్, హన్మకొండ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కృష్ణాశర్మ, వ్యాఖ్యాత, గాయకులు జనగాం రాము, చందన, సింగర్ చోటు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అంతరాలు లేని సమ సమాజ నిర్మాణమే సీపీఐ ధ్యేయం

**◆ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అంతరాలు లేని సమ సమాజ నిర్మాణమే సీపీఐ అంతిమ లక్ష్యమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలలో పాల్గొననున్న హనుమకొండ జిల్లా జనసేవా దళ్ వలంటీర్ల శిక్షణా శిబిరం శనివారం హనుమకొండలోని కుమార్ పల్లి యూత్ భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ శిబిరం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలో పేదలు, ధనికుల మధ్య తారతమ్యం విపరీతంగా పెరుగుతోందని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులంతా పేదల అభివృద్ధిని విస్మరించి, కేవలం కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తుల కోసమే పని చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే గత పదేళ్ల పాటు పని చేసిందని, తిరిగి మరోసారి వారి అండతోనే అధికారంలోకి వచ్చి వారి మేలుకోసమే పనిచేస్తున్నదని ఆయన విమర్శించారు. పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, దళితులు, గిరిజనులు, మైనారిటీలపై బీజేపీ పాలిత రాష్ట్రాలలో దాడులు పెరిగాయని ఆరోపించారు. చివరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలను కూడా ధ్వంసం చేసే ప్రయత్నం చేశారని, కమ్యూనిస్టులు, లౌకిక శక్తులతోనే ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ శిక్షణా శిబిరానికి ఇన్‌స్ట్రక్టర్‌గా జనసేవా దళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా సహాయ కార్యదర్శులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా గంగా గార్డెన్ అభివృద్ధి

◆ డాక్టర్ సనత్ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా గంగపుత్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ టి.సనత్ కుమార్ అధ్యక్షతన నగరంలోని ల్యాండ్‌మార్క్ హోటల్‌లో శుక్రవారం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గంగా గార్డెన్ అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణ, ట్రస్ట్ కమిటీ నియామకంపై చర్చించారు. గంగా గార్డెన్‌ను ప్రణాళికాబద్ధంగా, దశలవారీగా అభివృద్ధి పథంలో తీసుకుపోవడానికి ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పాక ఓం ప్రకాష్, కార్యదర్శి పాక వెంకటేశ్వర్లు, వరంగల్ పట్టణ అధ్యక్షులు తత్తరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం, ఈ సమావేశంలో గంగపుత్ర ట్రస్ట్‌కు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ డాక్టర్ టి.సనత్ కుమార్ (పాతవారే కొనసాగారు),వైస్ చైర్మన్ డాక్టర్ పిల్లి సాంబశివరావు, కార్యదర్శి చెరుకు సత్యం, జాయింట్ సెక్రటరీ-1 గుంటి కొమురెల్లి, జాయింట్ సెక్రటరీ-2 దగ్గుల శంకర్, కోశాధికారి పద్మ మహిపాల్, కార్యవర్గ సభ్యులుగా పాక ఓంప్రకాష్, పాక వెంకటేశ్వర్లు, పిండి విజయకుమార్, తత్తరి రాజానంద్, తత్తరి లక్ష్మణ్, కుర్న వెంకటేశ్వర్లు, ఎస్.విజయ్ కుమార్, ఆర్ లక్ష్మణ్ సుధాకర్, డాక్టర్ పొక్కుల ప్రవీణ్ ఎన్నుకోబడ్డారు. అడ్వైజరీ కమిటీకి గోపు సుధాకర్, టి.హనుమంతు, పిండి బాబన్న, పిండి కుమారస్వామి, పాత్కాల రమేష్, ఎన్. వెంకటేశ్వర్లు, చేతి శ్రీనివాస్, తులసి కళ్యాణి, క్రాంతి కుమార్, పాక శ్రీధర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని మాదారం గ్రామంలో ఉప సర్పంచ్ బాల్నే శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ సభ్యులు గుడి వంశీధర్ రెడ్డి గ్రామానికి విచ్చేసి వెంకటయ్య పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం వంశీధర్ రెడ్డి ఉప సర్పంచ్ బాల్నే శ్రీనివాస్ లకు, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు లింగాల ఘనపురం మండల నాయకులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్

### జనవరి 13, 14న పోటీలు

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** సంక్రాంతి పండుగ సందర్భంగా క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు రఘునాథపల్లి మండలంలోని వెల్ది గ్రామంలో మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు గ్రామ కబడ్డీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13, 14 క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్‌కు ఎలాంటి ఎంట్రీ ఫీజు ఉండదని నిర్వాహకులు తెలిపారు. గ్రామ ఆర్థిక దాతల సహకారంతో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులందరికీ భోజన వసతిని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఆర్గనైజింగ్ కమిటీ కోరింది.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** అశ్వరావుపల్లి ఆటో యూనియన్ అధ్యక్షులు కుర్ర పెద్ద శ్రీనివాస్ పదవ రోజు సందర్భంగా, రఘునాథపల్లి మండలంలోని వివిధ గ్రామాల ఆటో యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులందరూ శ్రీనివాస్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఆర్థిక సహాయంగా రూ.20,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల అధ్యక్షులు అడ్డూరి శ్రీనివాస్, కార్యదర్శి పేరువైన పరశురాములు, సీఐటీయూ మండల కన్వీనర్ పొదల నాగరాజు పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు బైరపాక నరసింగరావు, బోయిని యాదగిరి, రొయ్యల కమలాకర్, పొనగంటి యాదగిరి, ఎండీ సికిందర్, సుమన్, లక్ష్మీనారాయణ, అమృతం, యాదగిరి, నాగంటి పరశురాములు, కనకరాజు, లింగం, నవీన్, అశోకు, ప్రశాంత్, దిలీప్, అరుణ్ పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల మహాసభ



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ ఉద్యమకారుల మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ ఎంపీపీ రామ్మూర్తి బొచ్చు కుమార్ పిలుపునిచ్చారు. పరకాల అమరధామం నుంచి సూర్యాపేటలో జరిగే మహాసభకు సంబంధించిన ప్రచార యాత్రను ఆయన ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... పోరాటం, ఆత్మగౌరవం, త్యాగాలకు మారుపేరు తెలంగాణ అని అన్నారు. దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా మొక్కవోని ధైర్యంతో రాజీలేకుండా పోరాడిన చరిత్ర తెలంగాణదని అన్నారు. సూర్యాపేట ప్రాంతం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలకు కేంద్రంగా నిలిచిందని, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, స్వేచ్ఛ, సమానత్వాల కోసం పోరాటంలో అగ్రగామిగా నిలిచిందని గుర్తు చేశారు. కోటపాడు మిల్ట్రీ క్యాంప్‌పై దాడి నాటి మట్టి మనుషులు చేసిన పోరాట స్ఫూర్తియే తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిందన్నారు. ముల్కీ ఉద్యమంతో మొదలైన 1967-68 నాటి తొలిదశ ఉద్యమంలో 370 మంది, 1993 నుండి సాగిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో 1200 మంది బలిదానాలు, లక్షలాది మంది ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళల త్యాగాలతో 2 జూన్ 2014న 10 జిల్లాలతో కూడిన భౌగోళిక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినప్పటికీ, బూటకపు వాగ్దానాలు చేసి రెండు పార్టీలు మూడు ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయని, నేడు తెలంగాణ పరిస్థితి 'ఈనగాసిన చేను నక్కల పాలైనట్లుంది' అని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారుల కుటుంబాలు, వ్యక్తులు సర్వం కోల్పోయారని, కేసుల భారం మోయలేకపోతున్నారని అన్నారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక క్షణక్షణం బ్రతకడం కోసం పోరాడాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అందుకే ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం కోసం సూర్యాపేటలో జరిగే తెలంగాణ ఉద్యమ జేఏసీ మహాసభను అందరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జర్నలిస్టుల పురం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మడికొండ పవన్, పరకాల నడికూడ మండల అధ్యక్షులు చుక్క సతీష్, దూడపాక రమేష్, మేకల వినయ్, చుక్క ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ సేఫ్టీ అవగాహన ర్యాలీ



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** నేషనల్ రోడ్ సేఫ్టీ మంత్ (జాతీయ రహదారి భద్రతా మాసం) సందర్భంగా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. హసన్‌పర్తి సీఐ చేరాలు పర్యవేక్షణలో ఈ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో ఎన్ సీసీ విద్యార్థులు, పోలీసులు చురుకుగా పాల్గొన్నారు. హసన్‌పర్తిలోని పలు వీధులలో ట్రాఫిక్ రూల్స్ ప్రాధాన్యతను వివరిస్తూ, 'రోడ్ సేఫ్టీ అవగాహన' నినాదాలతో కూడిన బ్యానర్లను ప్రదర్శిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దేవేందర్, ఎస్సై రవి, ఎస్సై గోవర్ధన్, ఎస్ఐ సుజిత్ రెడ్డి, ఏఎస్ఐ మల్లికార్జున్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సన్మానం



**వరంగల్ వాయిస్, చిట్యాల :** చిట్యాల గ్రామ నూతన పాలకవర్గాన్ని గ్రామైక్య సంఘం మహిళా నాయకులు, ఏపీవో రాష్ట్ర అధ్యక్షుడు ఘనంగా సన్మానించారు. శనివారం గ్రామైక్య సంఘం సీసీ కట్కూరి రమాదేవి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడినటువంటి చిట్యాల సర్పంచ్ తౌటం లక్ష్మి, ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, 9వ వార్డు సభ్యురాలు మైదం శ్రావ్య శ్రీకాంత్ లను శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. నూతన సర్పంచ్ తౌటం లక్ష్మి ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామస్తులందరి సహకారాలతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని, సమస్యలన్నీ పరిష్కరించుకుందామని హామీ ఇచ్చారు. ఈ విధంగా ఘనంగా సన్మానించిన గ్రామైక్య సంఘం మహిళా నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఏపీవో (అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్)ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదరి మోహన్ రావు కూడా నూతనంగా ఎన్నుకోబడ్డ సర్పంచ్ తౌటం లక్ష్మి, ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యురాలు మైదం శ్రావ్యలను శాలువాతో ఘనంగా సన్మానించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులను ఏ విధంగా సమర్థవంతంగా వినియోగించుకోవాలి, ఆ నిధులతో గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలనే విషయంపై వివరణ ఇచ్చారు. గ్రామైక్య సంఘం సీఏ రామచందర్, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీలో సంక్రాంతి సంబరాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడంలో భాగంగా, హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం రోజున ముగ్గుల పోటీని ఘనంగా నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఆకర్షణీయమైన ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన వారిలో మొదటి బహుమతి బి.స్వప్న, రెండవ బహుమతి కె.శ్రీజిత, మూడవ బహుమతి సీహెచ్.శిరీషలతో పాటు ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు అందజేయడం జరిగింది. ముగ్గుల పోటీల కన్వీనర్‌గా చెన్నమనేని జయశ్రీ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ హనుమకొండ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణు గోపాల్, డాక్టర్ సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ, బాశెట్టి హరిప్రసాద్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



# చిన్నపిల్లల కిడ్నాప్ ముఠా అరెస్ట్

- వణుకుపుట్టిస్తున్న ముఠా దందా
- అయిదుగురు చిన్నారుల సురక్షిత రెస్క్యూ

**వరంగల్ వాయిస్, కాజీపేట :** వరంగల్ నగరంలో కలకలం సృష్టించిన చిన్నపిల్లల కిడ్నాప్‌ల కేసును కాజీపేట పోలీసులు, టాస్క్ ఫోర్స్ సంయుక్తంగా ఛేదించారు. ఐదు నెలల పసికందు కిడ్నాప్‌తో పాటు గతంలో జరిగిన మరో నాలుగు కిడ్నాప్‌లకు పాల్పడిన ముఠా సభ్యులను అరెస్ట్ చేసి, అపహరణకు గురైన ఐదుగురు చిన్నారులను సురక్షితంగా రక్షించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులను పెద్దపల్లి జిల్లా ఘవాపూర్ గ్రామానికి చెందిన కొడుపాక నరేష్ (42), శాంతినగర్‌కు చెందిన వెల్పుల యాదగిరి (32) గా గుర్తించారు. గత డిసెంబర్ 28, 2025 తెల్లవారుజామున కాజీపేట రైల్వే స్టేషన్ బయట ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న కన్నా నాయక్ కుమారుడు, 5 నెలల మల్లన్న కిడ్నాప్‌పై ఫిర్యాదు మేరకు కాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా కాజీపేట, టాస్క్ ఫోర్స్ బృందాలు విచారణ చేపట్టాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం అద్దె కారులో వచ్చిన నిందితులు మళ్లీ చిన్న పిల్లల్ని కిడ్నాప్ చేసే ఉద్దేశంతో కాజీపేట రైల్వే స్టేషన్ ఫుట్‌పాత్ వద్ద రెక్కీ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు వారిని అనుమానాస్పదంగా పట్టుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు తాము డిసెంబర్ 28న కిడ్నాప్ చేసిన మల్లన్నతో పాటు గతంలో మరో నలుగురు చిన్నారులను కిడ్నాప్ చేసినట్లు ఒప్పుకున్నారు. పిల్లలు కలగని దంపతులను లక్ష్యంగా చేసుకొని, ఈ పిల్లలను అనాథాశ్రమాల నుంచి తీసుకొచ్చినట్లు నమ్మబలికి, డబ్బులకు అమ్ముకున్నట్లు నిందితులు తెలిపారు. కిడ్నాప్ చేసి అమ్మిన చిన్నారులు మల్లన్న (5 నెలలు, డిసెంబర్ 2025, కాజీపేట): జన్నారం మండలం లింగయ్యపల్లిలో అమ్మకం, పాప (10 నెలలు, ఆగస్టు 2025, వరంగల్ రైల్వే స్టేషన్): మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో విక్రయం, బాబు (3 సంవత్సరాలు, అక్టోబర్ 2023, కాజీపేట రైల్వే స్టేషన్) జన్నారం మండలంలో అమ్మకం, పాప (5 నెలలు, అక్టోబర్ 2025, మంచిర్యాల రైల్వే స్టేషన్): మంచిర్యాలలో విక్రయం, పాప (10 నెలలు, జూన్ 2025, రామగుండం రైల్వే స్టేషన్): జగిత్యాల జిల్లాలో అమ్మినట్లు నిందితులు అంగీకరించారు. నిందితుల నేర ఒప్పుకోలు ఆధారంగా అపహరణకు గురైన 5 నెలల బాబు మల్లన్నతో సహా మొత్తం ఐదుగురు చిన్నారులను పోలీసులు రెస్క్యూ చేశారు. అదేవిధంగా, ఎలాంటి చట్టబద్ధ ఆధారాలు లేకుండా పిల్లలను కొనుగోలు చేసిన దంపతులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిన్నారుల కిడ్నాప్‌లకు పాల్పడిన ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్, కాజీపేట పోలీస్ స్టేషన్ అధికారులను, సిబ్బందిని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించి, రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, టాస్క్ ఫోర్స్, కాజీపేట ఏసీపీలు మధుసూదన్, ప్రశాంత్ రెడ్డి, కాజీపేట ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ సిబ్బందితో పాటు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

# ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంపై బీజేపీ కక్షసాధింపు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ధ్వజం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ (ఉపాధి హామీ) పథకాన్ని నిర్వీర్యం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఇది పేదలపై కక్షసాధింపు చర్య అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. హనుమకొండ డీసీసీ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య కూడా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని అడ్డుకోవడం పేదల పాలిట శాపంగా మారుతోందని ఎమ్మెల్యే నాయిని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం పథకాల పేర్లు మార్చాలనే నెపంతో బీజేపీ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని, అసలు సమస్యలను పరిష్కరించకుండా పేర్ల రాజకీయాలు చేయడం వల్ల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందని మండిపడ్డారు. గ్రామాల్లో పనులు నిలిచిపోవడంతో కూలీలు, పేద కుటుంబాలు అన్యాయాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పాత్ర శూన్యమని విమర్శించారు. ఆర్‌టీఏ చట్టం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను కూడా బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిజంగా అభివృద్ధి జరిగితే, ఇతర రాష్ట్రాలతో పోల్చి చూపాలని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే నాయిని డిమాండ్ చేశారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు హామీ ఏమైంది?, పదేళ్లు గడిచినా మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు ఎందుకు చర్యలు తీసుకోలేదు?, హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. ఈ సందర్భంగా, హన్మకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సిద్దాపురం గ్రామ సర్పంచ్ సంతోష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



# నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు

**పరకాల ఏసీపీ సతీష్ బాబు**

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మహాత్మా జ్యోతిబా పూలే వెనకబడిన తరగతుల సంక్షేమ పాఠశాల (బాలురు), శాయంపేటలో శనివారం ప్రిన్సిపల్ రేవతి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరకాల ఏసీపీ సతీష్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాయంపేట మండలం సీఐ రంజిత్ గారు, ఎస్సై పరమేశ్వర్ కూడా పాల్గొన్నారు. ఏసీపీ సతీష్ బాబు గారు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు మరియు ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులకు రవాణా భద్రత (ట్రాఫిక్ సేఫ్టీ) మీద పూర్తి అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా ఉండడానికి తప్పనిసరిగా పాటించవలసిన రవాణా నియమాలను, నిబంధనలను ఆయన వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోరు వేయించిన కేంద్ర మంత్రి

**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో భీమదేవరపల్లి ముదిరాజ్ సంఘం ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి గుడి ఆవరణలో బోరుబావి నిర్మాణం జరిగింది. సర్పంచ్ ఎన్నికలలో గెలిచిన వెంటనే కోరగానే బండి సంజయ్ కుమార్ ఈ సహాయం అందించారని సర్పంచ్, సంఘం పెద్దలు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. బోరుబావి విజయవంతంగా ఫుల్ సక్సెస్ కావడంతో ముదిరాజ్ కుల సంఘ పెద్దలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, ముదిరాజ్ సంఘం కుల పెద్దలు బండి సంజయ్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, భీమదేవరపల్లి ఉప సర్పంచ్ శనిగరపు ఐలయ్య, వార్డు సభ్యులు లలిత, బొల్లంపల్లి శ్యామ్, వెంకటేశ్వర్లు, సాతురి విజయ, ముదిరాజ్ సంఘం కుల పెద్దలు పాల్గొన్నారు.





# నిరుపేదలకు రగ్గుల పంపిణీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, చక్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని పలు ప్రాంతాల్లో నిరుపేదలకు రగ్గులను పంపిణీ చేశారు. తమ మనుమడు అభ్యుదయ కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ మానవతా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. చక్రి ఫౌండేషన్ సీఈఓ చెట్టిపల్లి దేవిక మాట్లాడుతూ, చలి తీవ్రతతో బాధపడుతున్న వారికి సహాయం చేయాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజురోజుకు చలి పెరుగుతున్న నేపథ్యంలో వీధుల్లో, రైల్వే స్టేషన్లలో, బస్టాండ్‌లలో ఉండే నిరుపేదలకు తమ సంస్థ అండగా ఉంటుందన్నారు. అలాగే, తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో చక్రి ఫౌండేషన్ సభ్యులు రమేష్, లయన్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com